సాక్షి
ఒడిశా

ఆదివారం । 4 । జూన్ । 2023



భారీగా గంజాయి స్వాధీనం

కొందమాల్ జిల్లా బల్లిగుడా పోలీసులు, పిరింగియా పోలీసులు రెండు వేర్వేరు ప్రాంతాల్లో శనివారం దాడులు నిర్వహించి 150కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. - 10లో



ఆపద సమయం.. ఆదుకునే హృదయం

రైలు దుర్ఘటన జరిగిన విషయం తెలిసిన వెంటనే బాలేశ్వర్, భద్రక్ జిల్లాల యువత స్పందించారు. - 10లో

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,62,126లు, బంగారం 800మిల్లీ గ్రాములు, వెండి 6.5 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.

న్యూస్‌రీల్

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాయగడ: చెట్టుకు ఉరి వేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీస్ స్టేషన్ పరిధి బలియాఖొడ గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటనలో మృతుడు పొడపడి పంచాయతీ కంసారిగుడ గ్రామానికి చెందిన త్రినాథ్ జొడియా(32)గా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేశారు. టికిరి ఐఐసీ బిజయలక్ష్మీ హికాక తెలిపిన వివరాల ప్రకారం.. త్రినాథ్ శనివారం ఉదయం గ్రామానికి సమీపంలోని తోటలోకి బహిర్భూమికి వెళ్లాడు. అయితే ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో మామిడి చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ పతాకం సగం అవనతం



జాతీయ పతాకాన్ని సగం అవగతం చేసిన దృశ్యం

జయపురం: బాలాసూర్ జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదాన్ని రాష్ట్ర విపత్తుగా ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ హోమ్ డిపార్టుమెంట్ ప్రకటించింది. ఈ విషాదకరమైన ఘటన నేపథ్యంలో మృతుల సంస్మరణార్థం జాతీయ పతాకాలను సగం వరకు దింపాలని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విభాగాలను ఆదేశించింది. రాష్ట్ర హోమ్ డిపార్ట్‌మెంట్ ఆదేశం మేరకు శనివారం ఉదయం జయపురం 26వ జాతీయ రహదారి బస్టాండ్ ప్రధాన కూడలి వద్ద 100 అడుగుల ఎత్తునున్న జాతీయ పతాకాన్ని సగం వరకు అవగతం చేశారు.

బీజేడీ కార్యాలయంలో సంతాపం



సంతాపం తెలుపుతున్న బీజేడీ నాయకులు

పర్లాకిమిడి: రైలు దుర్ఘటనలో మృతి చెందిన వారికి స్థానిక రాంనగర్ హైటెక్ ప్లాజా బీజేడీ కార్యాలయంలో శనివారం సంతాపం తెలిపారు. పార్టీ నాయకులంతా ఐదు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో డా.తిరుపతి పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, సీనియర్ నాయకులు బసంత్ దాస్, వి.ఎస్.ఎన్.రాజు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ యరగాన రామచంద్రరావు, కార్యదర్శి లక్ష్మీకాంత పోరిచ్చా తదితరులు పాల్గొన్నారు.

మత్తిలి సమితిలో జనసంపర్క్ శిబిరం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి దల్‌దలి గ్రామంలో జిల్లా పోలీసు యంత్రాంగం తరపున ఎస్పీ నితీష్ వాధ్వనీ ఆధ్వర్యంలో జనసంపర్క్ శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులకు నిత్యావసర సరుకులు, దుస్తులు, యువకులకు క్రీడా సామగ్రి, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఎటువంటి ఆపద కలిగినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మత్తిలి బీఎస్ఎఫ్ జవాన్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భీతావహం..!

నిన్నటి వరకు ఎవరికీ తెలియని ఓ కుగ్రామం.. ఊహకందని విషాదంతో అపఖ్యాతి మూట గట్టుకుంది. రాష్ట్ర చరిత్రలో రక్తాక్షరాలతో వందలాది మంది క్షతగాత్రుల హాహాకారాలకు వేదికైంది. ఎటుచూసినా గుట్టలుగా పడి ఉన్న మృతదేహాలతో యుద్ధ క్షేత్రాన్ని తలపించింది. తెగిపడిన అవయవాలు.. నిస్సహాయుల రోదనలు.. ఆప్తుల ఆర్తనాదాలతో బహనాగా బజార్ రైల్వేస్టేషన్.. భీతావహంగా కనిపించింది. – భువనేశ్వర్/కొరాపుట్/రాయగడ



బహనాగా బజార్ రైల్వేస్టేషన్ వద్ద కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు



బాలాసోర్ ఆస్పత్రి ప్రాంగణంలో గుట్టలుగా పడి ఉన్న మృతదేహాలు

- బహనాగా బజార్ రైల్వేస్టేషన్‌లో గుట్టలుగా మృతదేహాలు
- అవయవాలు తెగిపడటంతో మిన్నంటిన బాధితుల హాహాకారాలు
- ఎటుచూసినా హృదయ విదారకర దృశ్యాలతో భీతావహం వాతావరణం
- కొనసాగుతున్న సహాయక, పునరుద్ధరణ చర్యలు

బహనాగా బజార్ స్టేషన్ ప్రాంతంలో జరిగిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటన స్థలంలో భయానక దృశ్యాలు హృదయాన్ని కలచి వేశాయి. దుర్మరణం పాలైన వారి మృతదేహాలు ఘటనా స్థలంలో గుట్టలుగా పడి ఉన్నాయి. బంధు, మిత్ర వర్గాలు కోల్పోయిన ఆత్మీయులను గుర్తించేందుకు వీలైన సదుపాయాలను కల్పించడంలో రైల్వేశాఖ పూర్తిగా విఫలమైన అమానుష దృశ్యాలు తారసపడ్డాయి. శుక్రవారం రాత్రి సుమారు 7గంటలకు ప్రమాదం సంభవించగా.. శనివారం సాయంత్రం వరకు ఘటనా స్థలంలో మృతదేహాలను సురక్షితంగా పదిల పరచలేకపోవడం దీనికి తార్కాణంగా చెప్పవచ్చు. మృతదేహం సకాలంలో పదిల పరచకుంటే బాధిత కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నా.. గుర్తించేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. బాధితులకు సకల సహాయ సహకారాలు అందజేస్తామని ప్రధాని మోదీ మొదలుకొని అన్ని స్థాయిల మంత్రులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రకటించినా.. హామీలు నీటిమీద రాతలుగా తారసపడ్డాయి. ఎక్కడికక్కడ సహాయ కేంద్రాలు(హెల్ప్ డెస్క్) ఏర్పాటు చేసినట్లు ప్రకటించిన ఘటనా స్థలం బహనాగ రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఈ సదుపాయం వాస్తవంగా తారస పడకపోవడం విచారకరం.

స్వచ్ఛంద సేవలు అమూల్యం..

ఘటనా స్థలం పరిసరాల్లో స్థానికులు, సంస్థలు ఇతరేతర వర్గాలు బాధిత వర్గాలకు అందజేసిన వాస్తవ సహాయ సహకారాలు అమూల్యం. తాగునీరు, ఆహారం ఏర్పాట్లు నిరవధికంగా అందించి, ఆదుకున్నారు. బాలాసోర్, భద్రక్, కటక్ 3 జిల్లాల్లో పలు ఆస్పత్రుల్లో చేరిన బాధితులకు ఇదే తరహా సేవలతో ఆపత్కాలంలో బంధువులుగా ప్రత్యక్షమయ్యారు.

ఆచూకీ లేని లగేజీ..

ఘటనా స్థలంలో ప్రయాణికుల బ్యాగులు ఇతరేతర లగేజీ చిందరవందరగా పడి ఉంది. బాధితుల ఆచూకీ తెలుసుకోవడంలో అయిన వారు వర్ణనాతీతమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా దుర్మరణం పాలైన వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

నా మిత్రుడు ఏమయ్యాడో?



రైలు దుర్ఘటనలో అనేక విషాదాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆస్పత్రులలో కోలుకుంటున్న వారు నెమ్మదిగా వాస్తవ పరిస్థితిలోకి వస్తున్నారు. ప్రస్తుతం భద్రక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు సునీల్‌రామ్.. బీహార్‌కు చెందిన తన మిత్రుడు మనూ మహతో(25)తో కలిసి హౌరాలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. వీరిద్దరూ చెన్నై వెళ్లాల్సి ఉంది. కానీ ఈ దుర్ఘటన జరగడంతో విడిపోయారు. ప్రస్తుతం సునీల్ భద్రక్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తనతో కలిసి ప్రయాణం చేసి తప్పిపోయిన మిత్రుడు ఆచూకీ కోసం అందరినీ అభ్యర్థిస్తున్నాడు.

– సునీల్‌రామ్, మోతుబరి, బీహార్

కటక్ ఎస్‌సీబీలో 193మంది భర్తీ

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటనలో గాయపడిన 193మందిని కటక్ ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్చారు. వీరిలో 9మంది కోలుకుని డిశ్చార్జి అయినట్లు ఆస్పత్రి అత్యవసర అధికారి డాక్టర్ భువనానంద మహరణ తెలిపారు. చికిత్స కోసం భర్తీ అయిన వారిలో ముగ్గురు 18 ఏళ్ల లోపు యువకులు, ఏడుగురు మహిళలు ఉన్నారు. దుర్ఘటన నేపథ్యంలో అత్యవసర వైద్య, చికిత్స సేవల కోసం ఆస్పత్రి నేత్ర చికిత్స వార్డు పైఅంతస్తులో అదనంగా 100 పడకలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

ఆస్పత్రిని సందర్శించిన గవర్నర్..



భద్రక్ ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న గవర్నర్ గణేషీలాల్

రైలు ప్రమాదంలో గాయపడి భద్రక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ శనివారం పరామర్శించారు. వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. క్షతగాత్రులు పూర్తిగా కోలుకునే వరకు చికిత్స అందించాలని సూచించారు.

మంత్రి ప్రమీల మల్లిక్ పరామర్శ..



బాలేశ్వర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న మంత్రి ప్రమీల

బహనగా రైలు ప్రమాద ఘటనలో గాయపడి బాలేశ్వర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ప్రమీల మల్లిక్ పరామర్శించారు. క్షతగాత్రులకు కేంద్ర రైల్వే శాఖ ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను సంబంధిత అధికారులు పంపిణీచేస్తున్నారు. ఇందులో భాగంగా సారో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు రూ.50 వేలు చొప్పున అందిస్తున్నారు.

రాజకీయాలకు సమయం కాదు: మమతా బెనర్జీ



ఘటనా స్థలంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

అంతకుముందు వచ్చిన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రోటోకాల్ పక్కన పెట్టి ప్రమాదం జరిగిన ప్రాంతంలో పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇది రాజకీయాల సమయం కాదని, సహాయక చర్యల సమయంగా ప్రకటించారు. మృతులలో 60శాతం మంది బెంగాలీలు ఉన్నారన్నారు. బాధిత కుటుంబాలకు రూ.లక్ష చొప్పున్న పరిహారాన్ని బెంగాల్ ప్రభుత్వం అందజేస్తుందని ప్రకటించారు.

పరామర్శించిన కేంద్రమంత్రులు..



ఘటనా స్థలాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్విని శ్రీవైష్ణవ్, కేంద్ర విద్య, మానవవనరుల అభివృద్ధి శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పరిశీలించారు. వీరివురూ ఒడిశా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అనంతరం ఇరువురూ కలిసి భద్రక్, బాలాసోర్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి, తెలుసుకున్నారు. సత్వర చికిత్స అందించాలని సూచించారు. వారితో పాటు కేంద్ర మాజీమంత్రి, బాలాసోర్ ఎంపీ ప్రతాప్‌చంద్ర షడంగి ఉన్నారు.

స్థానికుల సహాయం మరువలేనిది: సీఎం నవీన్



బాలేశ్వర్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయిక్

రైలు ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ప్రజలు చేసిన సహాయం మరువలేనిదని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కొనియాడారు. శనివారం ఉదయం ఘటన జరిగిన ప్రాంతాన్ని సలహాదారుడు 5టీ కార్తికేయ పాండ్యన్‌తో కలిసి సందర్శించారు. అప్పటికే చేరుకున్న కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ శ్రీ వైష్ణవ్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలేశ్వర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి వెళ్లిన సీఎం క్షతగాత్రులను పరామర్శించారు. స్థానికులు సకాలంలో ఆదుకోకపోతే తాము బతికి ఉండేవాళ్లం కాదని పలువురు బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. ఆస్పత్రి రోదనలతో మిన్నంటడంతో సీఎం కాసేపు మౌనం వహించారు. అనంతరం ఆస్పత్రి బయట మీడియాతో మాట్లాడుతూ ఘటన ప్రాంతంలో స్థానికులు అందించిన సాయం మరువలేనిదని కొనియాడారు.

సీఎం నవీన్‌తో ఉదయనిధి స్టాలిన్ భేటీ

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో తమిళనాడుకు చెందిన మంత్రి ఉదయనిధి స్టాలిన్ భేటీ అయ్యారు. ఆ రాష్ట్రమంత్రి ఎస్ఎస్ శివకుమార్‌తో కలిసి శనివారం రాత్రి భువనేశ్వర్‌లో నవీన్ నివాస్‌లో సంప్రదింపులు చేశారు. రైల్వే దుర్ఘటనపై విచారం వ్యక్తం చేశారు. 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్ ప్రమాద వివరాలు ఉదయనిధికి వివరించారు. ఇదిలా ఉండగా.. ఘటన జరిగిన వెంటనే తమిళనాడు ప్రభుత్వం స్పందించింది. ముఖ్యమంత్రి స్టాలిన్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి, మంత్రులు, అధికారులను ఘటనా స్థలానికి పంపించారు. చెన్నై నుంచి ప్రత్యేక రైలు ఏర్పాటు చేసి, క్షతగాత్రుల బంధువులు ఒడిశా చేరుకునే చర్యలు తీసుకున్నారు. ప్రమాద తీవ్రత పెరగడంతో స్టాలిన్ తన కుమారుడు ఉదయనిధిని నవీన్ వద్దకు పంపి.. సానుభూతి ప్రకగించారు.



ముఖ్యమంత్రి నవీన్‌తో సంప్రదిస్తున్న ఉదయనిధి స్టాలిన్

దారి మళ్లిన రైళ్లు..

రాయగడ: బహనాగలో చోటు చేసుకున్న ఘోర రైలు ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని విశాఖపట్నం కోస్తారైల్వే పలు రైళ్లను దారి మళ్లించినట్లు ప్రకటించింది. భువనేశ్వర్, బాలేశ్వర్ మీదుగా ప్రయాణించాల్సి పలు రైళ్లు.. విశాఖపట్నం నుంచి విజయనగరం, రాయగడ, టిట్లాఘఢ్, సంబల్‌పూర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు. తదుపరి ఉత్తర్వులు విడుదలయ్యే వరకు ఈ ఆదేశాలు అమలులో ఉంటాయన్నారు.

- బెంగలూర్–అగర్తల హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్(12503) టిట్లాఘఢ్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది.
- సిలిఘాట్–తంబారం(15630) రైలు రౌర్కెలా, టాట్లాఘఢ్, విజయనగరం మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- పాట్నా–ఎర్నాకులం(62644) రైలు అంగూల్, విశాఖపట్నం మీదుగా చేరుకుంటుంది.
- దాఘా నుంచి విశాఖపట్నం(22873) చేరాల్సిన రైలు సంబల్‌పూర్, అనుగూల్ మీదుగా ప్రయానిస్తుంది.
- బెంగళూర్–గౌహతి(12509) ఎక్స్‌ప్రెస్ రైలు విజయనగరం, టిట్లాఘడ్, టాటానగర్ మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- సికింద్రబాద్–హౌరా(12704) రైలును తాత్కాలికంగా రద్దు చేశారు.
- గుణుపూర్–విశాఖపట్నం(08521) పాసింజర్ రైలు 3గంటలు ఆలస్యంగా విశాఖపట్నం చేరుకుంటుంది.

వేడెక్కిన రాజకీయం

- బీజేపీని లక్ష్యంగా చేసుకున్న ప్రతిపక్షాలు
- దిద్దుబాటు చర్యలు ప్రారంభించిన మోదీ సర్కార్



హెల్మెట్ లేకుండా రైలు పెట్టెలు కిందకు వెళ్లి, పరిశీలిస్తున్న రైల్వేమంత్రి అశ్విని శ్రీవైష్ణవ్

కొరాపుట్/భువనేశ్వర్/రాయగడ: బాలేశ్వర్‌లో జరిగిన రైలు ప్రమాదం కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వానికి ఊహించని సంకటంగా మారింది. రైల్వేమంత్రి అశ్విని శ్రీవైష్ణవ్ ఒడిశాకు చెందిన రాజ్యసభ ఎంపీ. రాజస్థాన్‌కు చెందిన ఆయన.. ఐఏఎస్ అధికారిగా ఒడిశా కేడర్‌లో పనిచేసి, ఉద్యోగ విరమణ పొందా రు. ఎన్‌డీఏ–2 అధికారంలోకి వచ్చిన వెంటనే రైల్వే శాఖలో సంస్కరణలు చేపట్టారు. ఈ క్రమంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అశ్విన్ అనేక సంస్కరణ లు చేపట్టడంతో దేశవ్యాప్తంగా బీజేపికి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చాయి. రైల్వేశాఖ మీద దశాబ్దాలు గా బెంగాల్, బీహార్ ఆధిపత్య జోరుకు కల్లెం పడింది. ఈ నేపథ్యంలో రైల్వేమంత్రి ఆయా రాష్ట్రాల్లో బీజేపీయేతర ముఖ్యమంత్రులకు లక్ష్యంగా మారారు. ఈ క్రమంలో దుర్ఘటన జరడం, రైల్వేశాఖ నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు ప్రాథమికంగా తేలడంతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ నేపథ్యంలో అశ్విన్ దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. వెనువెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. తన వెంట రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను రప్పించుకున్నారు. మరోవైపు ఘటన జరిగిన ప్రాంతం బాలేశ్వర్‌కు చెందిన బీజేపీ ఎంపీ, కేంద్ర మాజీమంత్రి ప్రతాప్ షడంగి నేతృత్వం వహించడం కూడా విపక్షాలకు మరో అవకాశంగా మారింది. ఈరైలు బెంగాల్–తమిళనాడు మధ్య రాకపోకలు సాగిస్తుండగా, ఈ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు బీజేపీ తో సరిగ్గా పడదు. వారిద్దరూ కూడా పరిస్థితి గమనించి బీజేపీని ఇరుకున పెట్టేందుకు ముందుకు దిగారు. తమిళనాడు ముఖ్యమంత్రి తన రాష్ట్రం నుంచి మంత్రుల బృందం పంపించడం, అప్పటికే పశ్చిమబెంగాళ్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బయలు దేరుతున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కేంద్రం క్షతగాత్రులకు వెంటనే నష్ట పరిహారం అందజేయ డం ప్రారంభించింది. ప్రధాని నరేంద్రమోదీ సైతం స్వయంగా రంగంలో దిగి ఒడిశా బయలుదేరారు. మరోవైపు, విశ్రాంత రైల్వే ఉన్నతాధికారులు తమ ట్విట్టర్ హ్యాండిల్ వేదికగా రైల్వేశాఖ నిర్లక్ష్యం వల్లే దుర్ఘటన జరిగినట్లు ప్రకటనలు చేస్తుండటం గమనార్హం.

● బాధితులు త్వరగా కోలుకోవాలని..



బహనాగా బజార్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి పలువురు ఆస్పత్రి పాలయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరంతా త్వరగా కోలుకోవాలని సైకతశిల్పి పద్మశ్రీ సుదర్శన పట్నాయక్ ఆకాంక్షించారు. ఇదే ఇతివృత్తంగా ఆయన పూరీ సాగర తీరంలో సైకతశిల్పాన్ని ఆవిష్కరించారు. ఘటనా స్థలంలో భయానక దృశ్యాన్ని సైకతంలో ప్రదర్శించడం విశేషం. -భువనేశ్వర్

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ అప్పలనాయుడు

భోగాపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నీలం అప్పలనాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. డెంకాడ మండలం ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ఈయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు అడ్మినిస్టేట్ అధికారి దాసరి బంగారయ్య ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులను సమన్వయం చేసుకుని మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి శాంతకుమారి, తదితరులు

పూసపాటిరేగ: వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి బి. శాంతకుమారి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వడదెబ్బ తగలకుండా చల్లని ప్రదేశంలో ఉంటూ, తెల్లటి దుస్తులు ధరించాలని సూచించారు. నాడు - నేడు పనులలో భాగంగా పాఠశాలలో ఫేజ్-2 కింద మంజూరైన పనులు పూర్తి చేసి నివేదికలు ఇవ్వాలని సర్వశిక్షాభియాన్ ఏఈ వెంకటరమణని ఆదేశించారు. పాఠశాలలో ఫేజ్-3 కింద మంజూరైన పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. పీహెచ్‌సీలలో రోగులకు అందుతున్న సేవలను వైద్యాధికారి రాజ్‌కుమార్ వివరించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ రామారావు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



జగనన్న కాలనీని సందర్శించిన రమణమూర్తి, తదితరులు

నెల్లిమర్ల: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లన్నీ త్వరితగతిన నిర్మాణం పూర్తయ్యేలా నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా హౌసింగ్ అధికారి ఎస్‌వీ రమణమూర్తి సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట జగనన్న కాలనీని వైస్ చైర్మన్ సముద్రపు రామారావుతో కలిసి రమణమూర్తి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పునాది దశలో ఉన్న 88 ఇళ్లు త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులను చైతన్యపరచాలని సూచించారు. ఆయన వెంట హౌసింగ్ డీఈ జి. మురళీమోహన్, ఏఈ పవన్, స్థానిక పెద్దలు నల్లి శ్రీనివాసరావు, తుమ్ము నారాయణమూర్తి, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

ఎక్స్‌లెన్స్ సెంటర్ల ఏర్పాటు ఉపయోగకరం



లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎక్సెలెన్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మాజీ వీసీ రాజగోపాల్

డెంకాడ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో అత్యాధునిక సాంకేతికతను, ప్రతిభను పెంపొందించడానికి ఎక్స్‌లెన్స్ సెంటర్ల ఏర్పాటు ఉపయోగకరంగా ఉంటాయని శ్రీకృష్ణదేవరాయ, జేఎన్‌టీయూ మాజీ వీసీ కె.రాజగోపాల్ అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సెంటర్లను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెన్ క్యూ మాజీ సీఈఓ మురళి, జేఎన్‌టీయూ జీవీ డీఈ డి.రాజ్యలక్ష్మి, వివిధ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని సుభాషిని కామన్ సర్వీస్ సెంటర్ వద్ద దాస్ మెమోరియల్ చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. సుభాషిని కామన్ సర్వీస్ సెంటర్ ప్రతినిధులు, ట్రస్టు సభ్యులు వాండ్రంగి వెంకటేష్, పట్నాయికుని శంకరరావు, వార్డుమెంబర్ బోడసింగి సత్యనారాయణ, సతీష్, గోవిందరావు, గణపతిరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

3వేల మందికి మజ్జిగ పంపిణీ

గరివిడి వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ట సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 3 వేల మందికి శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.వి.ఎస్.ఎస్.ఎన్.గుప్త, సంఘం ప్రతినిధులు వెంకటరాజు, సత్యారావు, సతీస్, అప్పలరాజు,లక్ష్మణరావు,సూర్యారావు పాల్గొన్నారు.

ఆపద సమయం.. ఆదుకునే హృదయం



కరకవలస సునీల్‌కుమార్ మహంతి



ట్రాక్టర్లపై మృతదేహాలను తరలిస్తున్న సత్యసాయి భక్తులు



సహాయక కార్యక్రమాల్లో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

కొరాపుట్/రాయగడ/భువనేశ్వర్: రైలు దుర్ఘటన జరిగిన విషయం సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైన వెంటనే బాలేశ్వర్, భద్రక్ జిల్లాల యువత స్పందించారు. ఎటువంటి పిలుపు లేకుండానే తమవంతు సాయం అందించేందుకు ముందుకు కదిలారు. భద్రక్, బాలేశ్వర్ జిల్లా కేంద్రాల ఆస్పత్రుల వద్దకు చేరుకొని, అవసరమైన క్షతగ్రాతులకు రక్తదానం చేసేందుకు సిద్ధమయ్యారు. రాత్రి నుంచి ఉదయం వరకు క్యూలోనే ఉండి రక్తదానం చేశారు. సుమారు వెయ్యి మంది యువత రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలిచారు.

సత్యసాయి భక్తుల సేవలు..

రైల్వే దుర్ఘటన జరిగిన వెంటనే సత్యసాయి భక్తుల సేవలు మొదలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే సత్యసాయి సేవాసమితి అఖిల భారత సమన్వయకర్త నిమిష్ పాండ్యా, జాతీయ సేవా సమన్వయకర్త కోటేశ్వరరావు, రాయగడకు చెందిన ఒడిశా సత్యసాయి సేవాసమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరకవలస సునీల్‌కుమార్ మహంతి వ్యక్తిగతంగా రంగంలోకి దిగారు. వారి సూచనతో సుమారు 70మంది సేవాదళ్ కార్యకర్తలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తాము తీసుకు వచ్చిన ట్రాక్టర్లపై క్షతగాత్రులు, మృతదేహాలను ఆస్పత్రులకు తరలించారు. వైద్య సిబ్బంది తగినంత లేకపోవడంతో తామే స్వపర్యలు చేసి, ప్రాథమిక చికిత్స అందజేశారు. అలాగే బాధితులకు ఆహారం, తాగునీరు అందించి, అందిరి మన్ననలు పొందారు.

ఎమ్మెల్యే బాహిణీపతి గొప్ప మనసు..

ప్రమాదం జరిగిన వెంటనే జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి గొప్ప మనసు చాటుకున్నారు. రాత్రి ఘటన జరిగిన సమయంలో భువనేశ్వర్ ఉన్న ఆయన.. సమాచారం తెలిసిన వెంటనే కాంగ్రెస్ కార్యకర్తలతో బాలేశ్వర్ వెళ్లారు. తనతో వచ్చిన కార్యకర్తలతో కలిసి క్షతగాత్రులకు సేవలు అందజేశారు. సమీప ఆస్పత్రులకు వెళ్లి రోగులను పరామర్శించారు. తన సొంత ఖర్చులతో అవసరమైన నిత్యవసరాలు, ఆహారం అందజేసి, అందరి మన్ననలు పొందారు.



మీడియాతో మాట్లాడుతున్న సీఎస్ ప్రదీప్ జెన్నా

యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు..

బాలేశ్వర్ సమీపంలోని బహనాగ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ప్రదీప్ జెన్న తెలియజేశారు. శనివారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సుమారు వెయ్యి మందికి పైగా గాయాలైన వారిని, సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందజేస్తున్నామన్నారు. తీవ్రంగా గాయపడిన వారికి చికిత్స అందజేసేందుకు ఎస్‌సీబీ, బారిపద మెడికల్ కేంద్రాలకు తరలించామన్నారు. మృతిచెందిన వారికి సంబంధించిన బాధిత కుటుంబాలు వచ్చి సరైన ఆధారాలను చూపిస్తే మృతదేహాలను అప్పగించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కొంతమంది మృతదేహాలను బాధిత కుటుంబాలకు అప్పగించడం జరిగిందని వివరించారు. గుర్తించని మృతదేహాలను భద్రపరిచి, 72 గంటల వ్యవధిలో ఎటువంటి ఆచూకీ తెలియకపోతే నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యలు గురించి ఆలోచిస్తామని పేర్కొన్నారు.

పరామర్శలకే ప్రాధాన్యం..

- హెలీప్యాడ్ లేకపోవడంతో పొలంలోనే దిగిన ప్రధాని హెలీకాప్టర్
- ప్రొటోకాల్స్‌ను పక్కన పెట్టి బాధితులను పరామర్శించిన ప్రముఖులు



ప్రమాద పరిస్థితిని ప్రధాని మోదీకి వివరిస్తున్న రైల్వే ఉన్నతాధికారులు



ఒడిశా గవర్నర్ గణేషీలాల్ పర్యటన

కొరాపుట్/రాయగడ/భువనేశ్వర్: అత్యంత విషాదకర ఘటనలో దేశంలో ప్రముఖులు ప్రొటోకాల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వకుండా పరామర్శలతో ముందుకు కొనసాగుతున్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేక హెలీకాప్టర్‌లో ఘటనా స్థలానికి చేరుకున్నారు. హెలీపాడ్ తయారు చేసే అవకాశం లేకపోవడంతో అక్కడి పొలంలోనే ప్రధాని దిగారు. సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోయినా చిన్న టెంట్‌లోనే సమీక్ష చేశారు. ఘటనపై రైల్వేమంత్రి అశ్వని శ్రీవైష్ణవ్‌తో మాత్రమే ముక్తసరిగా మాట్లాడారు. అనంతరం బాలేశ్వర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి వెళ్లారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి నవీన్ లేకపోవడం విశేషం. అంతకుముందు వచ్చిన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ప్రొటోకాల్ పక్కన పెట్టి ప్రమాదం జరిగిన ప్రాంతంలో పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇది రాజకీయాల సమయం కాదని, సహాయ చర్యల సమయంగా ప్రకటించారు.

చిరు వ్యాపారులకు ప్రత్యామ్యాయం చూపాలి



ఈఓ వనమాలి శత్పతితో మాట్లాడుతున్న చిరు వ్యాపారులు

పర్లాకిమిడి: పట్టణంలో పలుచోట్ల ఆక్రమ కట్టడాలు, చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మార్కెట్, పాతబస్టాండ్, పెద్ద బ్రాహ్మణవీధి సెంటర్, కొత్తబస్టాండ్, రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను శనివారం తొలగించారు. దీనిపై చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం పురపాలకశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వనమాలి శత్పతిని కలిసి, వినతిపత్రం అందించారు. తామంతా ఉపాధి కోల్పోకుండా ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

వెనుకబడిన వర్గాల సర్వేకు ఓకే..



ఈఓ, చైర్మన్‌తో మాట్లాడుతున్న కళింగ కోమటి ప్రతినిధులు

జయపురం: రాష్ట్రంలో చేపడుతున్న వెనుకబడిన వర్గాల సర్వేలో కళింగ కోమటి సామాజిక వర్గాన్ని చేర్చేందుకు జయపురం మున్సిపాలిటీ ప్రత్యేక కార్యచరణ ప్రారంభించింది. ఈ మేరకు పట్టణంలో నివసిస్తున్న దాదాపు 5వేల మంది కళింగ కోమటి వర్గాలను వెనుకబడిన జాబితాలో చేర్చేందుకు మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించి 3రోజులు సర్వే చేపట్టనున్నట్లు ఈఓ సిద్ధార్థ పటాన్నయక్ వెల్లడించారు. 2రోజుల క్రితం కళింగ వైశ్యసంఘం అధ్యక్షుడు వి.సత్యనారాయణ, సాధారణ కార్యదర్శి ఎస్.వెంకటరమణ మున్సిపల్ అధికారులు, చైర్మన్ నరేంద్రకుమార్ మహంతిని కలిసి, తమను సర్వే జాబితాలో చేర్చాలని కోరిన విషయం తెలిసిందే.

భారీగా గంజాయి స్వాధీనం



జయపురం: ఎక్సైజ్ సిబ్బందికి పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలు, గంజాయి



బరంపురం: పిరింగియా పోలీసులు అరెస్టు చేసినవారిని చూపిస్తున్న దృశ్యం



బరంపురం: పట్టుబడిన నిందితులతో బల్లిగుడా పోలీసు అధికారులు

బరంపురం: కొందమాల్ జిల్లా బల్లిగుడా పోలీసులు, పిరింగియా పోలీసులు రెండు వేర్వేరు ప్రాంతాల్లో శనివారం దాడులు నిర్వహించి, 2 హోండా సిటీ కార్లలో బరంపురం వైపు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు. కొందమాల్ జిల్లా పోలీసులు 150 కిలోల గంజాయితో పాటు కారుని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో వెస్ట్ బెంగాల్ మిధనపూర్ జిల్లాకి చెందిన హరదన బెహరా, భిశ్వాజిత్ దాస్‌లు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా పిరింగియా పోలీసు అధికారులు మరో కారుపై దాడులు చేసి 80 కిలోల గంజాయితో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అలాగే వారి దగ్గర నుంచి రూ.17 వేల నగదు సైతం స్వాధీనం చేసుకున్నారు.

జయపురం: బొరిగుమ్మ ఎక్సైజ్ అధికారులు శుక్రవారం సాయంత్రం ఒక ద్విచక్ర వాహనంతో పాటు 50 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ అధికారి బిశ్వజిత్ పాణిగ్రహి శనివారం తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కొరాపుట్ జిల్లా ఎక్సైజ్ ఎస్పీ అరుణ కుమార్ పాఢీ ఆదేశాల మేరకు సమితిలోని పలు గ్రామాల్లో అధికారులు పెట్రోలింగ్ నిర్వహించారు. అదే సమయంలో ఎక్సైజ్ వాహనాన్ని దూరం నుంచి చూసిన ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి, బైక్‌తో పాటు గంజాయిని విడిచిపెట్టి పారిపోయారు. వెంటనే బండిలో తనిఖీ చేయగా 50 కేజీల గంజాయి బయటపడింది. పట్టుబడిన గంజాయి విలువ రూ.5 లక్షలు ఉంటుందని బిశ్వజిత్ పాణిగ్రహి వెల్లడించారు. బైక్‌ను గంజాయిని సీజ్ చేశామని వెల్లడించారు. అలాగే నారిగాం సమీపంలో ఒక బైక్‌పై సొలప కల్లు అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 30 లీటర్ల సొలప కల్లుతో పాటు బైక్‌ను సీజ్ చేశామని వెల్లడించారు. రెండింటిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలియజేశారు.

జయపురం: ద్విచక్ర వాహనాలపై గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యవకులు ఎక్సైజ్ అధికారులను చూసి ద్విచక్ర వాహనాలను విడిచి పరారయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. కొంతమంది గంజాయిని ఛత్తీష్‌ఘఢ్ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం రాత్రి ఇన్‌స్పెక్టర్ దుర్బదల్ బిశ్వాల్, కొట్‌పాడ్ ఎక్సైజ్ ఏఎస్‌ఐ మాధవేష్ మరండి సిబ్బంది కొట్‌పాడ్ మర్తహండి వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే టర్నల్ సమీపంలో ఎక్సైజ్ సిబ్బందిని చూసిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనాలను విడిచిపెట్టి పరుగులు తీశారు. వెంటనే వారిని పోలీసులు వెంబడించినా, పట్టుకోవడం సాధ్యపడలేదు. అనంతరం రెండు బైక్‌లపై తరలిస్తున్న సుమారు 70 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని తెలియజేశారు.

నేడు జగన్నాథుడికి ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న జగన్నాథుడు

పాలకొండ రూరల్: జగములనేలు జగన్నాథుని రథోత్సవానికి ఆదివారం అంకురార్పణ జరగనుంది. ఇందులో భాగంగా స్వామివారికి జేష్ఠాభిషేకాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి వి.రాధాకృష్ణ శనివారం తెలిపారు. అనంతరం అర్చకస్వాములు స్వామివారి నేత్రాలను పుణ్య జలాలతో అభిషేకించి చీకటి గది లోకి చేరుస్తారు. ఈ నెల 20 నుంచి 30 వరకు జగన్నథుని రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో లడ్డూ, పులిహోరా ప్రసాద విక్రయాని కి రూ.5వేలు, జెయింట్ వీల్ ఏర్పాటుకు రూ.50 వే లు ధరావత్తుతో ఈ నెల 6న ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం వేయనున్న ట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.

నువ్వా .. నేనా..



విద్యుత్ బల్బులకు దీటుగా నువ్వా - నేనా అన్నట్లు చంద్రుడు కాంతులీనుతున్నాడు. నగరంలోని బాలాజీ జంక్షన్ వద్ద విద్యుత్ స్తంభానికి ఉన్న బల్బు పక్కనే చంద్రుడు దర్శనమిచ్చాడు. చూడచక్కని ఈ దృశ్యాన్ని శనివారం రాత్రి సాక్షి క్లిక్ మనిపించింది.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని బియ్యాలపేట గ్రామ శివారులో పేకాటాడుతున్న ముగ్గురు వ్యక్తులను రూరల్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 15,160 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై గణేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వక్తృత్వ పోటీలు రేపు

చీపురుపల్లి: పట్టణంలోని గీతా మందిరంలో ఈనెల 5న శ్రీమద్భగవద్గీతపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వ హించనున్నట్లు మందిర నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలి పారు. సోమవారం సాయంత్రం 4 గంటల కు గీతా మందిరం ప్రాంగణంలో పోటీలు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. ఆసక్తి గల విద్యార్థులు అంతా హాజర వ్వాలని, విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కనులపండువగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

- స్వామివారిని దర్శించుకుని ,పూజలు చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు సీతారాముల చిత్రపటాన్ని అందిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

డెంకాడ: మండలంలోని పినతాడివాడలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో సీతారాముల సహిత లక్ష్మణ విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శనివారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా విగ్రహ స్థిరప్రతిష్ఠాపన, పుణ్యాహవచనం, శిఖర ప్రతిష్ఠాపన, ఖరన్యాసపూర్వక దర్శనం, బలిహరణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం వైభవంగా చేపట్టారు. సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చుంనాయుడు, మాజీ సర్పంచ్‌లు పల్లె భాస్కరరావు, వాళ్లె సత్యవతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొర్నాన ఆదియ్య దంపతులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి రూ. 50 వేలకు పైబడి విరాళాలు ఇచ్చిన భక్తులను సన్మానించారు.

స్వామిని దర్శించుకున్న ప్రముఖులు..

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, రెల్వేబోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనుమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, పూసపాటిరేగ వైఎస్సార్‌సీపీ నాయకుడు మహంతి శ్రీను, వివిధ గ్రామాల నుంచి వచ్చిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు గిరిజన విద్యార్థి


గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో జావెలిన్‌తో ప్రాక్టీస్ చేస్తున్న చిరంజీవి

సీతంపేట: జాతీయ స్థాయి జావెలిన్‌త్రో పోటీలకు స్థానిక గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన వూయక చిరంజీవి ఎంపికయ్యారు. కొద్ది నెలల కిందట శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. భోపాల్‌లో ఈ నెల 6 నుంచి 12 వరకు జరగనున్న క్రీడల్లో చిరంజీవి పాల్గొననున్నట్టు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణమూర్తి తెలిపారు.

ఏపీఓ, ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

విజయనగరం ఫోర్ట్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఏపీఓ, ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లను జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాపరమేశ్వరి సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్.కోట ఏపీఓగా పని చేస్తున్న బి.రమ్య, ఎల్.కోట, డెంకాడ, రామభద్రపురం మండలాలకు చెందిన ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. ఎల్.కోటలో వేతనదారులు పనికి వెళ్లకపోయనా గత రెండు వారాలుగా మస్తర్లు వేసి వారి నుంచి డబ్బులు వసూలు చేసారనే అభియోగాలపై ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదని పీడీ తెలిపారు.

జిల్లా రిజిస్ట్రార్‌కు సత్కారం


డీఆర్ సృజనను సత్కరిస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.సృజనకు ఇటీవల జరిగిన బదిలీల్లో విశాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా నుండి బదిలీపై వెళ్తున్న సృజనను జిల్లాలోని 11 మంది సబ్ రిజిస్ట్రార్లు, ఇతర అధికారులు, సిబ్బంది శనివారం డీఐజీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో డీఐజీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆమె విధి నిర్వహణలో సేవలను కొనియాడారు.

ఉద్యోగ మేళాకు స్పందన


ఉద్యోగ మేళాలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారిణి అరుణ

విజయనగరం రూరల్: జిల్లా ఉపాధి కార్యాలయం, ఏపీఎస్ఎస్‌డీసీ, ప్రభుత్వ ఐటీఐ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. విశాఖపట్నంలోని సీనరీజస్ కాస్టింగ్స్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు నిర్వహించిన మేళాలో 142 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించిన సంస్థ ప్రతినిధులు తదుపరి రౌండ్‌కు 62 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి డి. అరుణ, ప్రభుత్వ ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ టీవీ గిరి, అధ్యాపకులు ఎం.యశ్వంత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన


శ్యామ్ ఇంద్రజాల ప్రదర్శన

విజయనగరం అర్బన్: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. ప్రముఖ ఇంద్రజాలికుడు జాదూగర్ శ్యామ్ పలు మ్యాజిక్‌లు చేసి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ బి.లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమెన్స్ టీ-20 క్రికెట్ లీగ్

విజయనగరం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించతలపెట్టిన ఉమెన్ టీ-20 క్రికెట్ లీగ్ టోర్నీకి విజయనగరం ఆతిథ్యమివ్వనుంది. లీగ్ పద్ధతిలో జరిగే టోర్నీలో బెజవాడ బ్లేజర్స్, రాయలసీమ క్వీన్స్, విజయనగరం రాయల్స్, వైజాగ్ డాల్ఫిన్స్ జట్లు తలపడనున్నాయి. డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తో పాటు విశాఖలో గల డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్‌లు జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు

'కుస్తీ'మే సవాల్..

- కుస్తీలో రాణిస్తూ పతకాలు సాధిస్తున్న యువత
- జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక
- కుస్తీ, కబడ్డీలకు ఉచిత శిక్షణ

గతంలో గ్రామాల్లో కుస్తీ పోటీలు ఎక్కడికక్కడ తారసపడేవి. ఎటువంటి పండుగలైనా.. పిల్లలకు సెలవుల సందర్భాల్లోనైనా ఈ పోటీలు కనిపించేవి. ముఖ్యంగా పండు వెన్నెలలో గ్రామాల్లో ఈ పోటీలు ఆడుతూ సందడి చేసేవారు. అంతా ఒకేచోట కూడి సరదాగా... ఉల్లాసంగా పోటీల్లో పాల్గొంటూ ఆరోగ్యవంతంగా ఉండేవారు. ప్రస్తుతం కాలం మారింది. క్రీడలూ మారాయి. ఆ క్రమంలో గ్రామీణ క్రీడగా ఉన్న కుస్తీ ఆటంటే ఎవరికీ తెలియకుండా పోయింది. అయినా ఆ క్రీడకు గుర్తింపు తెచ్చేలా ఆసక్తి కలిగిన కొందరు నేటికీ శిక్షణ ఇస్తూ గుర్తింపు పొందుతున్నారు.


వ్యాయామం చేస్తున్న కుస్తీ క్రీడాకారులు

గుర్ల: ఒకప్పుడు ప్రతి గ్రామంలో కుస్తీ పోటీలు ఎక్కడికక్కడే జరిగేవి. ప్రస్తుత కాలంలో ఆ పోటీలంటేనే చాలా మందికి తెలియని పరిస్థితి. ఆధునిక కాలంలో కుస్తీ పోటీలకు లభించే ఆదరణ అంతంతమాత్రంగానే ఉంటుంది. అయినా కుస్తీ పోటీలపై మక్కువ ఉన్న కొందరు శిక్షణ ఇస్తూ ఉనికిని చాటుతున్నారు. మండలంలోని కెల్ల గ్రామానికి చెందిన కర్రోతు జగదీష్, ఉదయ్‌కుమార్ కుస్తీ, కబడ్డీ క్రీడలపై నేటి యువతను చైతన్యపరుస్తూ శిక్షణ ఇస్తున్నారు. ఈ పోటీల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ యువతను ఆకర్షిస్తున్నారు.

40 మందికి శిక్షణ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం గరివిడి, గుర్ల మండలాలకు చెందిన 40 మంది యువత, విద్యార్థులకు కుస్తీ, కబడ్డీ క్రీడలకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు సరైన క్రీడా స్థలం లేకపోయినప్పటికీ క్రీడలలో రాణించేలా తగిన తర్ఫీదు ఇస్తున్నారు. కుస్తీలో రాణించాలనే దృఢ సంకల్పంతో విద్యార్థులు కఠోర శ్రమతో కూడిన శిక్షణ తీసుకొని జిల్లా, రాష్ట్ర స్థాయి కుస్తీ, కబడ్డీ పోటీలలో ఇప్పటికే రజతం, కాంస్య పతకాలు సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపికవుతున్నారు.

ఎనిమిదిసార్లు రాష్ట్ర స్థాయి పోటీలకు



గుర్ల గ్రామానికి చెందిన వాళ్లే చిన్నారావు చీపురుపల్లిలోని డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఎనిమిది సార్లు రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు రెండు బంగారు, మూడు రజతం, మూడు కాంస్య పతకాలు గెలుచుకున్నాడు. జాతీయ స్థాయి, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కుస్తీ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. జాతీయ స్థాయి కుస్తీ పోటీలలో పతకం గెలవానే సంకల్పంతో శిక్షణ తీసుకుంటున్నాడు.

'బంగారు' మోహన్



రాష్ట్ర స్థాయి కుస్తీ క్రీడా పోటీలలో గుర్ల గ్రామానికి చెందిన కలిశెట్టి మోహన్ ఇప్పటి వరకు మూడు బంగారు పతకాలు సాధించాడు. మోహన్ తొమ్మిది సార్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వీటిలో మూడు బంగారు, రెండు రజతం, నాలుగు కాంస్య పతకాలు సాధించాడు. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. జాతీయ స్థాయి కుస్తీ పోటీలలో రాణించాలనే ఉద్దేశంతో శిక్షణ తీసుకుంటున్నాడు.

ఉత్తమంగా రాణిస్తూ...



జాతీయ స్థాయి పోటీలకు పొన్నాడ ఉమామహేశ్వరరావు రెండు సార్లు ఎంపిక కావడంతో పాటు ఆ పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపాడు. ఉమామహేశ్వరరావు నెల్లిమర్లలోని డిగ్రీ ద్వితీయ ఏడాది చదువుతున్నాడు. ఆరుసార్లు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని రెండు రజతం, రెండు కాంస్య పతకాలు సాధించాడు.

జాతీయ స్థాయి పోటీలకు లావణ్య



జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు గరివిడి మండలానికి చెందిన వైగాల లావణ్య శిక్షణ తీసుకుంటుంది. లావణ్య ఈ నెల 6న ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొననుంది. కబడ్డీలో కూడా రాష్ట్రం తరపున ఆడుతుంది. కుస్తీలో రాణించడమే ధ్యేయమని చెబుతుంది. కుస్తీలో రాణించడానికి ఏడాదిగా శిక్షణగా తీసుకుంటుంది.

గుర్తింపు తెచ్చేలా...



జాతీయ స్థాయి కుస్తీ పోటీలలో రాణించి గుర్తింపు తెచ్చి పతకాలు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నాను. శిక్షణ తీసుకుంటున్న వారిలో ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలలో పతకాలు సాధించారు. కుస్తీపై యువత, విద్యార్థులకు అవగాహన పెంచి కుస్తీ శిక్షణ ఇస్తున్నాం. కుస్తీలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలనే ఉద్దేశంతో శిక్షణను ఉచితంగా ఇస్తున్నాం. ప్రతి రోజు 40 మంది విద్యార్థులు శిక్షణకు హాజరవుతున్నారు.

– కర్రోతు జగదీశ్, కుస్తీ కోచ్, కెల్ల


రాష్ట్ర స్థాయి పోటీలలో కుస్తీ పడుతున్న యువకులు(ఫైల్)

ఆధార్ అప్‌డేట్‌లో తప్పులు రానివ్వొద్దు


మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, డీఎల్‌డీఓ నిర్మలాదేవి

- డీఆర్‌ఓ ఎం.గణపతిరావు

విజయనగరం అర్బన్: సచివాలయాల్లో చేపడుతున్న ఆధార్ అప్‌డేట్ ప్రక్రియలో ఎటువంటి తప్పులు దొర్లనీయకుండా జాగ్రత్త పడాలని డీఆర్‌ఓ ఎం.గణపతిరావు అన్నారు. జిల్లాలోని ఆధార్ అప్‌డేట్ కేంద్రాలున్న సచివాలయ డిజిటల్ సెక్రటరీలకు స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన ఒక రోజు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి చేసుకోవాలనే విషయాన్ని క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తప్పులు లేని ఆధార్ అందించాలని, ఆ దిశగా వ్యక్తగత అంశాలను సక్రమంగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కో - ఆర్డినేటర్ అశోక్ అవగాహన తరగతులను నిర్వహించారు. డీఎల్‌డీఓలు నిర్మలాదేవి, లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆధార్ రీజినల్ కోఆర్డినేటర్ గిరిధర్, జిల్లా కో ఆర్డినేటర్ నారాయణరావు, గ్రామ, వార్డు సచివాలయాల అసిస్టెంట్ జిల్లా కో - ఆర్డినేటర్ రాము, అధార్ కేంద్రాలున్న సచివాలయాల డిజిటల్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి


మృతి చెందిన హరీష్


ఘటనా స్థలంలోనే మృతి చెందిన లక్ష్మి

పార్వతీపురం: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పార్వతీపురం టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పార్వతీపురం పట్టణం రెల్లివీధికి చెందిన అప్పలస్వామి ద్విచక్ర వాహనంపై తన మనవడు సొండి హరీష్(మూడున్నరేళ్లు)తో వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్తున్నారు. ఇదే మార్గంలో పార్వతీపురం నుండి గుమ్మలక్ష్మీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మోపెడ్‌పై వున్న అప్పలస్వామి, హరీష్ కింద పడిపోయారు. హరీష్ బస్సు టైర్ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పలస్వామి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు బాలుడి మృతదేహానికి శవపంచనామ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలుని తండ్రి కరుణాకర్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. బాలుడి తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యాంతమయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణారావు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

మహిళ దుర్మరణం


బొద్దాన లక్ష్మి(ఫైల్)

పాలకొండ: పాలకొండ - రాజాం రహదారిలో వెంకటగౌరి సినిమా థియేటర్ వద్ద శనివారం లారీ ఢీకొని మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే...నగర పంచాయతీ పరిధి గటాలడెప్పివీధికి చెందిన బొద్దాన లక్ష్మి(55) తాగునీరు సేకరించేందుకు వెళ్లగా పాలకొండ నుండి రాజాం వైపు వస్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే లక్ష్మి మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్‌ఐ బి.శివప్రసాద్ స్థానిక ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. ఈమె భర్త ఇటీవలే మరణించారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉండగా అందరికీ వివాహమైంది.

ఈవీఎం కొత్త గోదాంను పరిశీలించిన జేసీ


ఈవీఎం కొత్త గోదాంను పరిశీలిస్తున్న జేసీ మయూర్‌అశోక్

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ సమీపంలోనున్న ఈవీఎం నూతన గోదాంను జేసీ మయూర్ అశోక్ శనివారం పరిశీలించారు. ముందుగా గోదాంకు వేసిన తాళాలను, సీళ్లను జేసీ తనిఖీ చేశారు. ఈవీఎంల రక్షణ పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. అనంతరం గోదాంపైన నూతనంగా నిర్మించిన కొత్త భవనాన్ని పరిశీలించారు. వేర్వేరు భవనాల్లో భద్రపరిచిన ఈవీఎంలను ఒకే భవనంలోకి చేర్చడానికి చర్యలు చేపట్టాలని డీఆర్వో ఎం.గణపతిరావుకు సూచించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను భద్రపరచడానికి సరిపడే విధంగా భవనాన్ని నిర్మించినట్లు డీఆర్వో తెలిపారు. భవనానికి కల్పిస్తున్న భద్రత, సీసీ టీవీల ఏర్పాటును వివరించారు. జేసీ వెంట ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, నెల్లిమర్ల తహసీల్దారు కేవీ రమణరాజు, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, ఎన్నికల విభాగం తహసీల్దారు దేవప్రసాద్ తదితరులున్నారు.

గ్రీన్ ర్యాలీ రేపు

విజయనగరం రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న సోమవారం విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఉదయం 7 గంటలకు గ్రీన్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఆడిటోరియంలో కలెక్టర్ అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ చేతులు మీదుగా చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు, ప్రభుత్వేతర సంస్థలు, పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నగర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

భోగాపురం: మండలంలోని ముక్కాం కూడలి వద్ద ఎస్‌ఐ కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో నాతవలస చంపావతి నది నుంచి భోగాపురం వైపు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూతికవలస సమీపంలో గజరాజులు


పూతికవలస గ్రామ సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు దాటుతున్న గజరాజుల గుంపు

కురుపాం: కురుపాం మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పూతికవలస, కన్నపుదొరవలస గ్రామాల మధ్య గజరాజులు సంచరిస్తున్నాయి. పొలాలకు వెళ్లే రైతులను అటవీశాఖ అధికారులు శనివారం అప్రమత్తం చేశారు. ఏనుగుల సమీపంలోకి వెళ్లి ఫొటోలు, వీడియోలు తీసేందుకు ప్రయత్నించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

డీఆర్‌డీఏ సైంటిస్టుగా తేజవ్యాస్ ఎంపిక

బొబ్బిలి: బొబ్బిలి పట్టణానికి చెందిన గుత్తావల్లి తేజావ్యాస్ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)సైంటిస్టుగా ఉద్యోగం సాధించారు. గేట్ ఫలితాల్లో 64వ ర్యాంకును సొంతం చేసుకున్న విద్యార్థి సైంటిస్టుగా ఎంపిక కావడంతో తల్లిదండ్రులు విజయకుమార్(విశ్రాంత తహసీల్దార్), భవానీదేవి (విశ్రాంత హెచ్‌ఎం) సంతోషం వ్యక్తంచేశారు.

జాతీయ ఖోఖో పోటీలకు జిల్లా క్రీడాకారులు


జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన సబీర్, దిలీప్

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగున్న అండర్ – 19 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు విజయనగరానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో ఈ పోటీలు జరగనుండగా... విజయనగరం ఖాదర్ నగర్‌కు చెందిన సబీర్, దాసన్నపేటకు చెందిన దువ్వు దిలీప్ అర్హత సాధించారు. ఇటీవల జిల్లా వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు క్రీడాకారులు జాతీయ పోటీలకు శనివారం బయలుదేరారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ పోటీలకు వెళ్తున్న క్రీడాకారులను జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. జాతీయ పోటీల్లో క్రీడా ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

వ్యాయామంతో ఆరోగ్యం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు


సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద శనివారం సైక్లింగ్ ఫర్ హెల్త్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజు వారి ఒత్తిడి నుంచి బయట పడడానికి, మానసిక స్థితిని మెరుగుపరచుకోవడానికి వ్యాయమం ఒక చక్కటి మార్గమని చెప్పారు. రక్త పోటు నియంత్రణలోను, గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని నియంత్రించడానికి వ్యాయమం దోహదపడుతుందని తెలిపారు. సైక్లింగ్ వలన అసంక్రమిత వ్యాధులు ఊబకాయం, రక్త పోటు, మధుమేహం, గుండె జబ్బులను దూరం చేసుకోవచ్చునని చెప్పారు. ఉత్సాహంగా.. ఉల్లాసంగా ఉండడానికి వ్యాయమం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. క్రమం తప్పని వ్యాయమం మంచి నిద్రకు ఉపకరిస్తుందిని చెప్పారు. కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సూర్యనారాయణ, డీఐఓ డాక్టర్ శృతి, డాక్టర్ రవికుమార్, డెమోలు చిన్నతల్లి, రమణ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంతో అప్రమత్తం

- విచారణ కేంద్రం ఏర్పాటు
- ప్రయాణికుల వివరాలు వెల్లడి
- పలు రైళ్లు రద్దు, మరికొన్ని దారిమళ్లింపు


విజయనగరం రైల్వేస్టేషన్‌లో విచారణ కేంద్రం నిర్వహిస్తున్న కమర్షియల్ అధికారులు

విజయనగరం టౌన్: ఒడిశా రాష్ట్రంలో శుక్రవారం రాత్రి సంభవించిన ఘోర రైలు ప్రమాదంతో విజయనగరం జిల్లా రైల్వేస్టేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. స్టేషన్ ఆవరణలో ప్రత్యేక విచారణ కేంద్రాన్ని ఏర్పాటుచేసి ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందజేస్తున్నారు. రైలు ప్రమాదంలో గాయపడిన , మృతిచెందిన వారి సమాచారం తెలుసుకునేందుకు ఫోన్: 83339 05022 నంబర్‌కు ప్రయాణికుని ఫొటో, ఇతర వివరాలు వాట్సాప్ చేయాలని కోరారు. టోల్ ఫ్రీ నంబర్ 1800 425 0101ను అందుబాటులో ఉంచా రు. విజయనగరం రైల్వే పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ ఫోన్: 94906 17089 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. కమర్షియల్ విభాగం ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ పోర్టికో వద్ద ఫోన్: 08922- 221202, 221206 నంబర్లు ఏర్పాటుచేశారు. విజయనగరం మీదుగా హౌరా వైపు వెళ్లే సుమారు 18 రైళ్లను, మరికొన్నింటిని పాక్షికంగా రద్దుచేస్తూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే ప్రకటన విడుదల చేసింది. మరికొన్నింటిని దారిమళ్లించింది.

జిల్లావాసులందరూ క్షేమం

విజయనగరం అర్బన్: ఒడిశాలోని బాలాసోర్ వద్ద శుక్రవారం జరిగిన మూడు రైళ్ల బోగీలు బోల్తాకొట్టిన దుర్ఘటనలో మృతిచెందిన వారిలో విజయనగరం జిల్లాకు చెందినవారు లేరని జేసీ మయూర్ అశోక్ స్పష్టంచేశారు. బాధితులు, క్షతగాత్రుల సమాచారం సేకరణ కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం (ఫోన్ నంబర్ 08922-236947)ను ఏర్పాటు చేశామన్నారు. డీఆర్వో ఎం.గణపతిరావు పర్యవేక్షణలో అంబులెన్స్‌లు, స్థానిక రైల్వే స్టేషన్ వద్ద తహసీల్దార్ కేడర్‌లోని అధికారులను అందుబాటులో ఉంచామన్నారు.

విద్యుత్‌శాఖ ఎస్‌ఈగా లక్ష్మణరావు


ఎస్‌ఈ లక్ష్మణరావుకు అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు

విజయనగరం ఫోర్ట్: విద్యుత్‌శాఖ ఎస్‌ఈగా మువ్వల లక్ష్మణరావు శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్‌ఈగా పనిచేసిన పి.నాగేశ్వరరావుకు విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ (రెగ్యులేటరీ అథారిటీ పవర్ పర్చేజ్‌విభాగం)కు బదిలీ అయింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. లోఓల్టేజ్, హైఓల్టేజ్ సమస్య లేకుండా చూస్తానని చెప్పారు. ఉద్యోగులంతా ఎస్‌ఈని కలిసి అభినందనలు తెలియజేశారు. విద్యుత్‌శాఖ కార్యాలయంలో పనిచేసే టౌన్ ఏడీ ఎల్.సత్యనారాయణకు నెల్లిమర్లకు బదిలీకాగా, ఆయన స్థానంలో మధురవాడలో పనిచేస్తున్న కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

డయేరియా బాధితుల గుర్తింపునకు ఇంటింటి సర్వే

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: డయేరియా లక్షణాలతో బాధపడుతున్న పిల్లలను గుర్తించేందుకు ఈ నెల 5 నుంచి 17వ తేదీ వరకు ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లతో ఇంటింటి సర్వే నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డయేరియా లక్షణాలు ఉన్న పిల్లలు ఉంటే వారికి ఓఆర్‌ఎస్ ద్రావణం, జింక్ ద్రావణం అందించి, వాటి వినియోగంపై తల్లులకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలను జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎండలో ప్రయాణం చేసేటప్పుడు మంచినీరు ఎక్కువగా తాగాలన్నారు. అనంతరం క్షయనివారణ శాఖలో ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. విధి నిర్వాహణను నిజాయితీగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ స్మృతి, డీఎల్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు లావణ్య ఎంపిక

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి శ్రీరామ్ జూనియర్ కళాశాలకు చెందిన బైపీసీ విద్యార్థిని లావణ్య జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఇటీవల విజయనగరంలోని రాజీవ్‌స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపింది. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న అండర్-19 పోటీల్లో ఏపీ జట్టు తరపున ఆడనుంది. విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, సిబ్బంది అభినందించారు.

5న బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగబోయే జూనియర్స్ బాల, బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్నట్టు బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్ శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలోని బాక్సింగ్ హాల్‌లో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2007 జనవరి 1వ తేదీ నుంచి 2008 డిసెంబర్ 31 తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. క్రీడాకారులు తమ ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలన్నారు. ఆ రోజు జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 99083 53698 నంబర్‌ను సంప్రదించాలన్నారు.